# ఎదులాబాద్‌లో వరిధాన్యం కొనుగోలు ప్రారంభం

-తుఫాన్ దృష్ట్యా వారంపాటు వరికోతలు ఆపండి: డిఎం

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సుగుణాబాయి, జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డిలు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఇటీవల ఇక్కడ సహకార సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కౌంటర్లను ప్రారంభించినప్పటికి కొనుగోలు చేయకపోవడంతో రైతులు స్థలం లేక వర్షంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డిఎం, డిసిఓలు చేరుకొని ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డితో కలిసి రైతులతో మాట్లాడి కాంటకు అవసరమైన గన్నిసంచులు, పరికరాలను సిద్ధం చేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం వరిధాన్యం ఏగ్రేడ్ రకంకు రూ.2,389లు, సాధారణ రకంకు రూ.2,369లు చొప్పున కనీస మద్దతు ధర కల్పిస్తుందని వారు తెలిపారు. తుఫాన్ దృష్ట్యా రైతులు వారం రోజుల పాటు వరికోతలు చేపట్టకూడదని వరిధాన్యం దిగుబడి చేస్తే తడిసే



ఎదులాబాద్‌లో వరిధాన్యం సేకరణను ప్రారంభిస్తున్న డిఎం సుగుణాబాయి, డిసిఓ వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రాంరెడ్డి

ఆస్కారముందని పేర్కొన్నారు. సొసైటీ సేకరిస్తున్న వరిధాన్యంలో తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండాలని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జగదీష్, సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజురీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

-ఎబివిపి ధర్నా..ట్రాఫిక్‌కు అంతరాయం, నాయకుల అరెస్ట్

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల విద్యార్థుల కళాశాల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు భాను డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో మంగళవారం అఖిలభారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎబివిపి నాయకులు, విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభఉత్వం విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు అవస్థలు పడ్డారు. ధర్నా విరమించాలని పోలీసులు కోరినప్పటికి ఎబివిపి నాయకులు ససేమిరా అనడంతో ఎస్ఐ శేఖర్, రాఘవేందర్‌లు వారిని బలవంతంగా రహదారి నుంచి తప్పించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో ఎబివిపి ఘట్‌కేసర్



ఘట్‌కేసర్‌లో ధర్నా చేస్తున్న ఎబివిపి నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నగర కార్యదర్శి మనీష్, విభాగ్ టెక్నికల్ సెల్ కన్వీనర్ అనీష్, ఉదయ్, బలరాం, మణిసాయి, భరత్, శివసాయి, చరణ్, అరవింద్, దిలీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



కీసర ప్రధాన చౌరస్తాలో మానవహారం నిర్వహిస్తున్న సిఐ ఆంజనేయులు,ఎస్ఐలు

## పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**కీసర, అక్టోబరు 28, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని సిఐ ఆంజనేయులు అన్నారు. మంగళవారం కీసర ప్రధాన చౌరస్తాలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా కీసరలోని జిల్లా పరిషత్ పాఠశాల, శ్రద్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు సుమారు 2 వందల మందితో ఫుట్ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ వారోత్సవాల ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రజల్లో దేశభక్తి ,సామాజిక బాధ్యత భావాలను పెంపొందిచడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు విద్యార్థులు జోహర్లు తెలుపుతూ నివాళులు అర్పించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. పోలీసు అమరవీరుల సంస్కరణ వారోత్సవాలను అక్టోబరు 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటేష్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినం ప్రాముఖ్యత



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలు పాటించి జాగ్రత్త వహించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ వై.రవీందర్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ యంనంపేట్ చౌరస్తాలో మంగళవారం గట్టుమైసమ్మ ఆటోయూనియన్ సభ్యులతో ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు ప్రజల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివన్నారు. ఆటోడ్రైవర్లు పాటించాల్సిన ట్రాఫిక్ నియమాలపై ఆయన అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐలు మన్నె విజయకృష్ణమూర్తి, మహిపాల్‌రెడ్డి, ఎఎస్ఐ తిరుపతిరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్, రవితేజలు పాల్గొన్నారు.

## అమరవీరుడు సందీప్ కుటుంబానికి అండగా ఉంటాం: డిసిపి



సందీప్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మల్కాజ్‌గిరి డిసిపి పద్మజారెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహండ్స్ కానిస్టేబుల్ తిక్క సందీప్ కుటుంబానికి పోలీసుశాఖ అండగా ఉంటుందని మల్కాజ్‌గిరి డిసిపి పద్మజారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని సాయిసందీప్ కాలనీలోని సందీప్ నివాసానికి మంగళవారం పోలీసులు అధికారులు చేరుకొని కుటుంబాన్ని పరామర్శించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మల్కాజ్‌గిరి డిసిపి పద్మజారెడ్డితో పాటు అధికారులు సందీప్ ఇంటికి వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జవాన్ సందీప్ తల్లి, భార్యలను శాలువాలతో సన్మానించి అండగా ఉంటామని జ్ఞాపికను అందజేశారు. ప్రభుత్వ పరంగా, పోలీసుశాఖ నుంచి సందీప్‌కు రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని డిసిపి పద్మజారెడ్డి పేర్కొన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో భాగంగా ప్రాణత్యాగాలు చేసిన పోలీసు అమరవీరులను సంస్మరించుకోవాలన్నారు. సందీప్ తల్లి శోభ, భార్య పావని, తమ్ముడితో మాట్లాడి వారి వృత్తికి సంబంధించిన సహకారం అందిస్తామని ధైర్యంగా ఉండాలని ఏలాంటి ఇబ్బంది వచ్చినా తెలియజేయాలని సూచించారు. మల్కాజ్‌గిరి అదనపు డిసిపి వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి, ఘట్‌కేసర్, పోచారం, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్లు ఎం.బాలస్వామి, బి.రాజువర్మ, గోవింద్‌రెడ్డి, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, ఎ.శేఖర్, రాఘవేంద్ర, సహకార సంఘం మాజీ డైరక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బొక్క సత్తిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గురుకుల్‌లో పరిశుభ్రత కార్యక్రమం

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని గురుకుల్‌లో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురుకుల్ పరిరక్షణ సమితి కన్వీనర్ అంకం సురేశ్‌యాదవ్ తెలిపారు. సేవ్ గురుకుల్‌లో భాగంగా హైస్కూల్, జూనియర్ కళాశాల ఆవరణలో కొన్ని సంవత్సరాలుగా పరిసరాలు చెత్తచెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా తయారైందని తెలిపారు. అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో పరిశుభ్రత పనులు చేస్తామని పేర్కొన్నారు. గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పూర్వవిద్యార్థులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## మొంథా ముంచుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

వెంకమ్మగూడ, బండోని గూడ, బుగ్గోనిగూడ, తాళ్లగూడ, మామిడిపల్లి, రంగాపూర్, ఈదులపల్లి, మొదల్లగూడ, వీర్లపల్లి తదితర గ్రామాలలో పత్తి, వరి చేలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. వ్యవసాయధికారులు సమగ్ర పరిశీలన జరిపి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు మొరపెట్టుకున్నారు.

**చేతికొచ్చిన పంటలపై ప్రభావం**

**ఆమనగల్లులో తడిసిన ధాన్యం**

ఆమనగల్లు మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుండే ముసురు ప్రారంభమైంది. మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఓ మోస్తారు వర్షాలు పడ్డాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లన్ని జలమయమయ్యాయి. ఉదయం నుండి చల్లని గాలులు వీచాయి. ఈవర్షం పంటలపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న వరి, పత్తి పంటలు వర్షాలకు తడిసిపోతున్నాయంటున్నారు. వరిపంట నేలకొరుగుతుందని, పత్తి పూర్తిగా తడిసిపోతుందని అంటున్నారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డుకు వచ్చిన మొక్కజొన్న, వరి ధాన్యంపై అకాల వర్షం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. మార్కెట్‌యార్డులో సరైన వసతులు లేకపోవడంతో రైతుల ధాన్యం వర్షంకు తడిసిపోయింది.

## సూర్యనారాయణ నమో నమః

(మొదటి పేజీ తరువాయి)

అత్వెల్లి గ్రామ చెరువు వద్ద నిర్వహించిన ఛఠ్ పూజ కార్యక్రమానికి ఎంపీ ఈటల విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవనం సాగాలంటే సూర్యశక్తి కావాలని, సూర్య భగవానుడికి పూజ చేసి శక్తి ఇవ్వాలని బీహార్, యూపీ సమాజం దీపావళి పండుగ అనంతరం చెరువు, నదుల దగ్గర ఛఠ్ పూజలు చేయడం ఆనందదాయకమని అన్నారు. ప్రజలందరూ సుఖంగా సంతోషంగా ఉండాలని పూజించడం సంతోషకర విషయమన్నారు. హైదరాబాద్ సిటీ చెరువులన్నీ చచ్చి పోయాయని, వాటన్నిటిని పునరుజ్జీవనం జీవనం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అత్వెల్లిలో వచ్చే సంవత్సరం లోపు మంచి ఏర్పాట్లు చేసుకుందామని చెప్పారు. దేశాభివృద్ధిలో మీ పాత్ర మరువలేనిది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాలతో 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను మూడవ స్థానంలోకి తీసుకొచ్చారని తెలిపారు. దీనిని మరింత ముందుకు తీసుకుపోవడానికి, మేడిన్ ఇండియాను నిజం చేసి చూపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి మీ అండదండలు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు నందారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ జెపి అధ్యక్షురాలు శైలజా హరినాథ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, నాయకులు మల్లికార్జున్ ముదిరాజ్, జగన్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్, జనసేన సమితి ప్రతినిధులు శ్రీకాంత్ పాండే, సుజిత్ సింగ్. రాజేష్, సంతోష్, కపిరాజు సింగ్ పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ద్వారా వంద మందికి నేత్రపరీక్షలు

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం లయన్స్‌క్లబ్ మౌలాలి ఎంఎస్ రెడ్డి లయన్స్ నేత్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ కన్న పరశురాంగౌడ్, మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్‌గౌడ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సార శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో వందమందికి పైగా మున్సిపల్‌కార్మికులకు కంటి పరీక్షలు చేయగా కొంతమందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. లయన్స్‌క్లబ్ అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మార్కెటింగ్ లయన్ కృష్ణజీవన్ బజాజ్, జిల్లా చీఫ్ అడ్మినిస్ట్రేటర్ లయన్ చందగిరిప్రసాద్, మేడిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వేముల కేశవనాథంగౌడ్, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ కోశాధికారి సన్నిధి కృష్ణప్రసాద్,





మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి నేత్రపరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉపాధ్యక్షులు రేసు లక్ష్మారెడ్డి, లంబ సత్యనారాయణ, నాగేశ్‌కుమార్‌గుప్త, బిందు, వేణుమాధవ్, మాధవి, లక్ష్మి, మమతశర్మ, జంగయ్య, లక్ష్మారెడ్డి, రవిశంకర్, రాజు, నర్సింగ్‌రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మగుట్ట అండర్‌పాస్ నిర్మాణం చేయాలని విజ్ఞప్తి

**ఘట్‌కేసర్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బైపాస్ రహదారి మైసమ్మగుట్ట వద్ద అండర్‌పాస్ వంతెన మంజూరైనప్పటికి నిర్మాణ పనులు చేపట్టడం లేదని అఖిలపక్ష నాయకులు మంగళవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అండర్‌పాస్ నిర్మాణ అనుమతి ఇచ్చిందని అధికారులు ఎలాంటి పనులు చేయడం లేదని వారు ఎంపీకి తెలుపగా ఆయన ఎన్‌హెచ్‌ఏఐ అధికారికి ఫోన్ చేసి అండర్‌పాస్‌పై ఆరా తీయగా కొంతమంది అండర్‌పాస్ చేయవద్దని వినతిపత్రం అందజేశారని అందుకే ఆపడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోను మంజూరైన పనులు ఆపకూడదని ఎంపీ రాజేందర్ స్పష్టం చేశారు. మైసమ్మగుట్ట దేవాలయానికి వెళ్లే భక్తులకు, మైసమ్మగుట్టకాలనీ ప్రజలకు, హస్టల్ విద్యార్థులకు అండర్‌పాస్ నిర్మాణం జరిగితే రహదారి దాటడానికి అవకాశం ఉంటుందని, ప్రమాదాలు నివారించవచ్చని వారు



మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్‌ను కలిసిన అఖిలపక్ష నాయకులు

ఎంపీకి తెలిపారు. మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండారి అంజనేయులు, స్థానికులు ఎంపీని కలిసి వచ్చారు.

## మూగవేదన

(మొదటి పేజీ తరువాయి)

బీమా నిర్వహించాలని ప్రయత్నించి కొంత వరకు సఫలీకృతమైనా.. ఆయన మరణాంతరం పశు సంపదకు బీమా చేసేందుకు సంస్థలు ముందుకు రాలేదు. ఎందుకంటే ఒక్కో కాపరి వద్ద 300 నుంచి 500 వరకు గొర్రెలు, మేకలు, ఇతర పశువులు ఉంటాయి. అందులో 50 జీవాలకు మాత్రమే బీమా పొంది ఏవి చనిపోయినా పరిహారం కోసం ప్రయత్నించరు. దానివల్ల సంస్థలకు ఆర్థిక భారం ఏర్పడుతుందని గ్రహించి బీమా చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు, జబ్బులు, ప్రమాదాల వల్ల జీవాలు చనిపోయినప్పుడు, పరిహారం పొందలేక తీవ్రంగా నష్టపోతున్నారు.

## అవినీతిపై దండయాత్ర చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

జరుగకుండ తమ విధులలో పారదర్శకత, జవాబుదారి తనంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలలో వారోత్సవాలు నిర్వహించాలని దీనిలో భాగంగ స్కూల్స్‌లో క్విజ్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ప్రజలలో పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు, విభాగాలు కూడ కార్యకలాపాలను చేపట్టి ఫోటోలు పంపాలని సూచించారు. ప్రతి డిపార్ట్‌మెంట్ నుంచి ప్రజలకు ఏఏ సేవలు అందిస్తారనే అంశాలను ప్రజలకు తెలిసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అడిగిన సమాచారాన్ని ఎలాంటి సమస్యలు లేకుండ అందించాలని ఆయన సూచించారు. విధి నిర్వాహణలో ఎలాంటి వత్తిళ్లకు గురికాకుండ నిజాయితీగ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మించటానికి ప్రభుత్వ అధికారులు అందరు సహకరించాలన్నారు. ప్రభుత్వ నిధులు దారి మళ్లించకుండ అనవసరపు ఖర్చులు జరుగకుండ, అవినీతిని నిరోధించటమే విజిలెన్స్ ప్రధాన లక్ష్యం అని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌కు ప్రతి డిపార్ట్‌మెంట్ సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ అవినీతి రహిత సమాజానికి తోడ్పడాలని అన్నారు. విజిలెన్స్ శాఖ వారు ప్రారంభించిన టోల్‌ఫ్రీ నెం.14432ను ప్రజలు అందరు వినియోగించుకుని అవినీతి సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వారితో పాటు జిల్లా డిఆర్ఓ హరిప్రియ, విజిలెన్స్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఫలం ఆశించకుండా పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ, న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, రీజినల్ విజిలెన్స్ ఇన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ పారిశుధ్యం

(మొదటి పేజీ తరువాయి)

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై, వనమహోత్సవం ఎన్ఆర్ఇజిఎస్, పారిశుద్ధం, తదితర అంశాలపై కలెక్టర్ నారాయణ రెడ్డి ఆర్డీవోలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, హౌసింగ్ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, ఎపిఎమ్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటి వరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం చేయని వాటిని వెంటనే ప్రారంభించాలని, మార్క్ అవుట్ చేసిన ఇండ్లను బేస్మెంట్ లెవల్‌కు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. నిజమైన పేద లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేపట్టేలా చూడాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. మంజూరీలు పొందిన వారందరూ తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పనులు చేపట్టేలా చూడాలని, ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. వనమహోత్సవం పై సమీక్షిస్తూ ప్రతి గ్రామ, మునిసిపాలిటీ పరిధిలో అంగన్వాడి కేంద్రాలలో పాఠశాలల్లో ఇన్స్టిట్యూట్లో వైకుంఠ ధామాలలో, పల్లె ప్రగతి పార్కుల్లో నిర్దేశించిన లక్ష్యాలను 100 పూర్తి అయ్యేలా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలను పరిశీలించుటకు టీంలు ఏర్పాటు చేసి నవంబర్ 1వ తేది నుండి పరిశీలించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను 100పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా గ్రామీణ పథకం ద్వారా చేపట్టిన ఇండ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పాఠశాలలో గురుకులాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రతిరోజు పారిశుద్ధం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో గురుకులాలలో మరమ్మతులు చేపట్టవలసిన మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని కొత్తగా నిర్మించే దగ్గర మరుగుదొడ్లను నిర్మించాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పిడి శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, సివిల్ సప్లై అధికారి వనజాత, విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, ఆర్డీవోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతి

**చిక్కడపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త:** మోహన్ మెలోడీస్ నిర్వహణలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ఇటీవల మృతి చెందిన తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతి కి సంగీత స్వర నివాళి కార్యక్రమం మోహన్ మెలోడీ అధినేత కలగా కృష్ణమోహన్ నిర్వహణలో జరిగింది.



ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ ఆకాశవాణి లో లలిత గీతాలు సాలూరి రాజేశ్వరరావు తో కలిసి. బాల సరస్వతి గానం చేసి ప్రాచుర్యం కలిగించిన ప్రతిభా గాయని అని పేర్కొన్నారు. కిన్నెర రఘురాం, రసమయి డాక్టర్ యం కె రాము, రావు బాల సరస్వతి కుమారుడు సూర్య రావు, సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ, సంగీత స్వరకర్త విన్నకోట మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహక సంస్థ స్థాపకుడు కలగ కృష్ణ మోహన్ సారథ్యం. వహించగా ప్రముఖ లలిత, సినీ గాయని గాయకులూ వినోద్ బాబు, శశి కళ స్వామి, సురేఖ, దుర్గ, హిమ బిందు, మాధవి, బాల కామేశ్వర రావు, చింతలపాటి సురేఖ, లక్ష్మణ్, నాగేశ్వర రావు తదితరులు బాల సరస్వతి , ఎస్ రాజేశ్వర్ రావు, ఘంటసాలతో కలసి పాడిన పాటలు మధురంగా ఆలపించారు.

## ఆల్విన్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త :**

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్లోని సా యి నగర్‌లో



నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ ఏర్పాటు కావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయి నగర్‌లోని ప్లాట్ నెంబర్ 71 ఇంటి నెంబర్ 46 137/డబ్ల్యూ లో సదరు నిర్మాణదారుడు ఎలాంటి సెట్ బ్యాగ్ లేకుండా నాలుగు అంతస్తుల బహుళ అంతస్తులు భవనాన్ని నిర్మించా డు. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించి న అక్రమ నిర్మాణంపై ఎయిర్ టెల్ టవర్‌ను నిర్మించడంతో చుట్టుపక్కల ప్రాంతాల వాసులు ఇబ్బందులకు గురవుతున్నా రు. ఇక్కడ టవర్ ఏర్పాటు చేయడం వల్ల పరిసర ప్రాంత వాసులైన చిన్న పిల్లలకు గర్భిణీ స్త్రీలకు వృద్ధులకు పలు రకాల అనారోగ్య పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని స్థాని కులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భవనంపై ఏర్పాటు చేసిన ఎయిర్టెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ పరిసర ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

# ఆక్రమణలపై మున్సిపాలిటీ కొరడా



ఆక్రమణలను తొలగింపు చర్యలను పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

**ఆమనగల్లు, అక్టోబరు28, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారితోపాటు ఆర్అండ్‌బి రోడ్లపై తిష్టవేసిన ఆక్రమణలపై మున్సిపాలిటి కొరడా ఝులిపించింది. జాతీయ రహదారి 765 హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారితోపాటు షాద్‌నగర్-మాడ్గుల రోడ్డుపై ఆక్రమణలను మంగళవారం మున్సిపాలిటి సిబ్బంది తొలగించారు. రోడ్డుకు ఇరుపక్కల ఉన్న ఆక్రమణలను స్వచ్ఛంధంగా తొలగించుకోవాలని హుకుం జారీ చేశారు. మున్సిపాలిటి, పోలీస్‌శాఖల సమన్వయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. పోలీసులు పెద్ద సంఖ్యలో ఉండడంతో అందరి దృష్టి అక్కడే కేంద్రీకృతమైంది. పండ్లు, తోపుడు బండ్లు, ఇతరత్ర చిరువ్యాపార కొట్లను వెనక్కి పంపించి వేయడం, ఆక్రమణలను తొలగించడంతో ప్రస్తుతం పట్టణ రోడ్లన్ని విశాలంగా దర్శనమిచ్చాయి. ఆటోడ్రైవర్లకు పార్కింగ్ పట్ల అవగాహన కల్పించారు. ఇష్టారీతిన పార్కింగ్ చేసి వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తే చట్టపర ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై బి. వెంకటేశ్, మున్సిపాలిటి సిబ్బంది టిపిఓ వరప్రసాద్, మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, మున్సిపాలిటి కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, చిట్టిబాబు, మహబూబ్, సుధాకర్, సురేష్, రవి, నర్సింహ్మా, ప్రశాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

## నవీన్ యాదవ్ గెలుపు ఖాయం

### శ్రీధర్‌వర్మ

**షాద్‌నగర్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి అధికార ప్రతినిధి శ్రీధర్ వర్మ ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎంపీ క్యాంటీస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఆదేశానుసారం మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి అధికార ప్రతినిధి శ్రీధర్‌వర్మ ముదిరాజ్ మరియు ఎన్ఎంఆర్ కాంసెన్సీ ఇంచార్జ్ మంగ అశోక్ ముదిరాజ్, నాయకులు కాశ బోయిన శేఖర్ ముదిరాజ్, సుంకర బోయిన మహేష్ ముదిరాజ్, వేణుగోపాల్ ముదిరాజ్, శేర్లింగంపల్లి రవికుమార,ప్రవీణ్ ముదిరాజ్ కిషోర్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ రంజిత్ ముదిరాజ్ తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కమిటీ, బీసీ బిడ్డ వి నవీన్ యాదవ్ కు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ మహాశయులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

### ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్

**షాద్‌నగర్ టౌన్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం, స్థానిక సిఐటియూ ఆఫీస్‌లో జరి గింది. ఈసమావేశంలో రంగా రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియం బర్స్ మెంట్ విడుదల చేయా లని ఈ నెల 30వ తేదీన బీటెక్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఐటిఐ, పారామెడికల్, కళాశాలలు బంద్ లో భాగంగా రాష్ట్ర వ్యాప్త బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం పాలుమార్లు మాట ఇచ్చి మాట తప్పింది. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదు, అని ఇప్పటికైనా ప్రభుత్వం అలోచించి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ కార్యదర్శి శివ శంకర్ టౌన్ కమిటీ సభ్యులు చరణ్, బబ్లు, నరేష్, శివ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

## సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

### -చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**వికారాబాద్, అక్టోబరు28, ప్రభాతవార్త:** సర్దార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్దార్ వల్లబాయ్ పాటేల్‌కు యావత్ తెలంగాణ ప్రజలు రుణపడి ఉన్నారని అన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చిన్న చిన్న రాజ్యాలను ఐక్యత చేసి దేశంలో విలీనం చేయడంలో పటేల్ ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ హైదరాబాద్ స్టేట్‌గా ఉండేదని, నవాబుల పాలనలో ఎంతో అరాచకం ఉండేదని, దాన్ని గుర్తించి పటేల్ నవాబులతో చర్చలు జరిపి భారతదేశంలో విలీనం చేశారని గుర్తు చేశారని, ఇందుకు గాను తెలంగాణ ప్రజలు పటేల్‌కు రుణపడి ఉన్నారని పేర్కొన్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహించ తలపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, పాదయాత్ర, పటేల్ జీవితంపై ప్రముఖుల ప్రసంగాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌ఓ మంగీలాల్, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సతార్ తదితరులు ఉన్నారు.



సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

# ఇసుక అక్రమ రవాణా

### ట్రాక్టర్లు సీజ్

**ధారూరు, అక్టోబరు 28, ప్రభాత వార్త:** అక్రమంగా అడవి మార్గం నుంచి ట్రాక్టర్‌లో ఇసుక ా తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ కనకరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూర్ రేంజ్ పరిధిలోని సెక్షన్ ఆఫీసర్, సిబ్బందితో కలిసి యాలాల మండలంలోని కమలాపూర్ అడవిలో నైట్ గస్తీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఎలాంటి అ ామతులు లేకుండా అటవీ మార్గం నుంచి ఇసుక ట్రాక్టర్లు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అ ామతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ల ా వెంటనే చేసి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్ మహేష్, అనంతయ్యపై కేసు నమోదు చేశామని అన్నారు. ట్రాక్టర్లు యాలాల మండలంలోని బాణాపూర్, అడల్వార్ గ్రామానికి చెందిన వారి తెలిపారు. అడవిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెక్షన్ ఆఫీసర్ కనకరాజు హెచ్చరించారు.



ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

# రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**ఆమనగల్లు, అక్టోబరు28, ప్రభాతవార్త:** పేరుకుపోయిన కళాశాల విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫిజ్‌రియంబర్స్ మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆమనగల్లు ఏబివిపి భాగ్ డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, సకాలంలో రియంబర్స్ మెంట్ అందక ప్రైవేటు కళాశాలలు నేడు ఆర్థిక భారంతో మూతపడే అవకాశాలు దారి తీస్తున్నాయని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏబివిపి కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఏబివిపి సీనియర్ నాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్ ఆధ్వర్యంలో ఏబివిపి శ్రేణులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు, నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిప్యూటీ తహశీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు లండం మల్లేశ్, గోరటి భరత్‌లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలు రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్స్ షిప్, ఫీజ్‌రియంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో రూ. 8100కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడువు అవుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బకాయిలు విడుదల చేయడంలో తాత్స ర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వతీరుతో రాష్ట్రంలో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. ఇప్పటికే ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసిన ప్రభుత్వం స్పందించటంలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో పేద విద్యార్థుల చదువులకు తీరని ఆటంకం ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే త్వరలోనే ఏబివిపి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని లండం మల్లేశ్, గోరటి భరత్ హెచ్చరించారు. కార్యక్రమంలో కొౖట సురేష్, పాత్లావత్ రాకేశ్, చెన్నంశెట్టి మల్లేశ్, ఎడవల్లి అంజి, నేనావత్ సురేష్, సుమన్‌నాయక్, తరుణ్‌రాథోడ్, బద్రునాయక్, సునీల్, అనిల్, ప్రభుత్వ, ప్రైవేటు ఢిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏబివిపి నాయకులు

# 90శాతం ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం పూర్తి



ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలిస్తున్న ఎంపిడిఓ కుసుమ మాధురి

**ఆమనగల్లు, అక్టోబరు28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని ఆమనగల్లు మండల ఎంపిడిఓ కుసుమ మాధురి అన్నారు. మండలంలో 90.6 శాతం నిర్మాణం ఇళ్ళు పూర్తి అయ్యాయని ఆమె వివరించారు. మండల పరిధిలోని సీతారాంనగర్‌తండాలో మంగళవారం ఎంపిడిఓ పర్యటించారు. తండాలో నిర్మాణం జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ళను ఆమె పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడారు. అలాగే ఆమనగల్లు మండలంంలోని 13 గ్రామపంచాయతీలకు 334 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరయ్యాయని, అందులో 29మంది మినహా మిగతా 305 మంది ఇళ్ళ నిర్మాణం చేపట్టారన్నారు. కాగా ఇప్పటివరకు 136 ఇళ్ళు బేస్‌మెంట్ లెవల్, 50 ఇళ్ళు రూఫ్ లెవల్, 48 ఇళ్ళు స్లాబ్ లెవల్ పూర్తి చేసుకున్నాయన్నారు. అలాగే ఒకటి పూర్తి స్థాయిలో నిర్మాణం జరుపుకుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకోవాలని ఎంపిడిఓ కుసుమ మాధురి సూచించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో ప్రజలకు లాభం లేదు

### ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈయాత్ర
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**షాద్‌నగర్ టౌన్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వల్ల రాష్ట్ర ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాట కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్ నగర్ జిల్లా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజ ర్వాయర్ సందర్శించడానికి వెళ్తున్న సందర్భంలో బెంగుళూరు హైదరాబాద్ జాతీయ రహదారి షాద్‌నగర్‌వద్ద రంగారెడ్డి జిల్లా జాగృతి నియోజకవర్గ ఇంచార్జ్ చీమల రమేశ్ కురుమ, ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, రాష్ట్రఉపాధ్యక్షుడు కోళ శ్రీనివాస్,మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తఫాతో కలిసి ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేఖర్లు అడిగిన ప్రశ్నలకు జవాబుగా తెలంగాణలో జరుగుతున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల గెలుపు ఓటముల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమిలేదన్నారు. జాగృతి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈయాత్రను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేవలం ఉచిత బస్సులు మాత్రమే ఇచ్చి మిగతా ముఖ్యమైన హామీలు పింఛన్లు ఇండ్లు తదితర అంశాల విషయంలో నిరక్ష ్యం చేస్తున్నారని కవిత విమర్శించారు. ప్రజలను మేల్కొల్పి వారిలో చైతన్యం తెచ్చే విధంగా తన పర్యటనలు కొనసాగుతాయని ఆమె సందర్భంగా తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు సంబంధించి జరుగుతున్న నిరక్ష ్యం పై నిలదీసేందుకు తమ పోరాటాలు కొనసాగుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి విభాగం ప్రధాన కార్యధర్శి రాం కోటీ, రాష్ట్ర యంబిసి అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, అందుగుల సత్యనారాయణ,ఉదయ బాను షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు మహేష్, కేశంపేట్ మండల అధ్యక్షుడు వెంక టయ్య,కొత్తూరు కుమార్ మండల అధ్యక్షుడు వీరయ్య, చౌదర్ పల్లి మండల అధ్య క్షుడు అంజీ కురమ , పరూక్ నగర్ మండల అధ్యక్షుడు మల్లేశ్,నరేందర్ గోపు వర్ష జాగృతి శ్రేణులు, మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు.



షాద్‌నగర్‌లో కవితకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

## ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు అనురాగ్ వర్సిటీ విద్యార్థులు ఎంపిక

**ఘట్‌కేసర్ రూరల్,అక్టోబరు 28, ప్రభాత వార్త:** వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీకి చెందిన ఇద్దరు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపిక అయినట్లు యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సి. మల్లేశ్ తెలిపారు. పోచారం మున్సిపల్ పరిధిలోని అనురాగ్ యూనివర్శిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు టి. అజయ్‌విక్రమ్, ఎస్. పూర్ణశ్రీ అనే ఇద్దరు విద్యార్థులు హేమచంద్రాచార్య నార్త్ గుజరాత్ యూనివర్శిటీ పాటన్, గుజరాత్‌లో జరుగనున్న ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌కు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ నిర్వహకులు వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనురాగ్ యూనివర్శిటీ జాతీయ సేవా పథకం ద్వారా జాతీయ స్థాయి యువత సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో చురుకైన భాగస్వామ్యాన్ని మరొకసారి చాటిచెప్పిందని అన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించిన వారిలో ఇంజినీరింగ్ కళాశాల డీన్ వి. విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సి. మల్లేశ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్రీ సంతోశ్ కుమార్, టి. పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.





అనురాగ్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ డిపార్టుమెంటు డీన్ బి. విజయ్‌కుమార్

## నీట్‌లో మెరిట్ విద్యార్థినికి సత్కారం

### అభినందించిన పాపిశెట్టి రామ్

**కడ్తాల్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** కడ్తాల మండలం మద్రిపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి యాదయ్య మహేశ్వరి దంపతుల కూతురు ఈర్లపల్లి శ్రావణి 2025 నీట్ పరీక్షలో ప్రతిభ కనబరచి మంచి ర్యాంక్ సాధించి గద్వాల ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించినందుకు గాను ఆమనగల్ పట్టణానికి చెందిన సంఘసేవకులు పాపిశెట్టి రాము శ్వేత దంపతులు అభినం దించారు. విద్యార్థి శ్రావణిని శాలువాతో ఘనంగా సన్మానిం చారు. మునుముందు అన్ని రంగాల్లో రాణించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పూసల భాస్కర్, శ్రీను, గజ్జె యాదయ్య, ఈర్లపల్లి శ్రీశైలం, తదితరులు ఉన్నారు.



## భారీవర్షాలతో పైర్లకు అపార నష్టం

### అన్నదాతల ఆందోళన

**కొందుర్గు,అక్టోబరు 28, ప్రభాతవార్త:** మెంత తుఫాను కారణంగా అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గత ఖరీఫ్ సీజన్లో మండల పరిధిలో రైతులు తమ పొలాలలో పత్తి మొక్కజొన్న వరి ,కంది,రాగులు తదితర పంటలు సాగుచేశారు. విత్తనాలు నాటిన తర్వాత అవసరం ఉన్నప్పుడు వర్షం పడలేదు కానీ, గత 6 నెలలుగా ఎంతో కష్టపడి ,ఆర్థికంగా ఖర్చు పెట్టి సాగుచేసి పంటలు ప్రస్తుతం కోత దశకు వాచ్చాయని, ఇప్పుడు అకాల తుఫాన్ ప్రభావం వలన పంటలన్నీ చెడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగైతే తమ పరిస్థితి ఏంటి అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మొలకెత్తిన మొక్కజొన్న, పత్తి నీ కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసీ అన్నదాతలను ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మారుట్లలో యువతి ఆత్మహత్య

### -పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన ఆరుట్ల గ్రామస్థులు

**రంగారెడ్డి, అక్టోబరు 28, ప్రభాతవార్త:** మారుట్లలో పంబాల నందిని (18) యువతి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. నందిని మృతికి కారకుడిగా గ్రామంలోని ఓ యువకుడుపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తూ, తక్షణమే యువకుడిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో గ్రామస్థులు మంగళవారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. ప్రేమ పేరుతో తమ కూతురిని బలి చేసుకున్నాడని అనుమానిత వ్యక్తిపై ఫిర్యాదు చేయగా విచారణ చేసి కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ మధు తెలిపారు.



పోలీసు స్టేషన్ ముందు ధర్నాకు కూర్చున్న కుటుంబ సభ్యులు,గ్రామస్థులు

## నందిగామలో విజిబుల్ పోలీస్ చెకింగ్

### వాహనాలను తనిఖీ చేసిన సిఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది

**నందిగామ, అక్టోబరు 28, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో శంషాబాద్ ఏసిపి ఆదేశాల మేరకు విజిబుల్ పోలీస్ తనిఖీలో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో పాత జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం అనుమానిత వ్యక్తులు, వా హనాలను తనిఖీలు చేశారు. చిరు జల్లులను సైతం లెక్కచేయకుండా వాహ నాలను పోలీసులు పరిశీలించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దేవరాజ్, యాదయ్య, ఏఎస్ఐ గోపాల్, పోలీస్ సిబ్బంది శ్రీరాములు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న సిఐ ప్రసాద్

# ప్రజల సహకారంతో ముందడుగు వేస్తా

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్ టౌన్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** షాద్ నగర్ నియోజకవర్గంలో అందరి సహకారం ఎంతో అవసరం.. వారి సహకారంతోనే అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాను నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ఎమ్మెల్యేగా నా బాధ్యత.. అభివృద్ధి కోసం నేను ఎక్కడ తగ్గే ప్రసక్తే లేదు అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మంగళ వారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ తోపాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీఖాన్ బాబర్, గిరిజన నేత రఘునాయక్, అగ్గనూర్ బస్వం, చౌదరిగుడా మండల పార్టీ అధ్యక్షులు చలివేంద్రం పల్లి రాజు, నందిగామ మండల పార్టీ అధ్యక్షులు జంగ నరసింహ యాదవ్, గంగనమోని సత్తయ్య తదితరులు హాజరయ్యారు. మున్సిపాలిటీ ప్రగతి, రహదారులకు పురోగతి, షాద్ నగర్ నియోజకవర్గంలో మున్సిపాలిటీల ప్రగతితో పాటు రహదారుల పురోగతి కోసం నిధులు సమకూర్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. షాద్ నగర్, కొత్తూరు మున్సిపాలిటీలను నియోజక వర్గంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇందులో భాగంగా షాద్ నగర పట్టణ మున్సిపల్ అభివృద్ధి కోసం రూ.18.75 కోట్లు మంజూరు అయినట్లు వెల్లడించారు. దీని ద్వారా మూడు ప్యాకేజీల కింద సుమారుగా 35 పనులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. అంతర్గత కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పార్కుల అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా ఈ నిధుల ద్వారా చేపడుతామని వెల్లడించారు. పార్కులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష ్యంగా ముందుకు వెళతామని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో సుమారు రూ. 105 కోట్ల రూపాయల నిధులతో 140 కిలోమీటర్ల మేరకు గ్రామీణ రహదారుల అనుసంధానం కోసం నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనికోసం టెండర్లు కూడా వేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ అభివృద్ధి విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదని ఆయన వెల్లడించారు. త్వరలో హెచ్ఎండిఏ ద్వారా కూడా నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గ్రామీణ రహదారులు ఇలా.. ఒక్కో కిలోమీటర్ కు రూ. 75 లక్షల చొప్పున ప్రస్తుతం నిర్మాణం చేపడుతున్న రహదారులకు సుమారు 105 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇందులో చౌదరిగుడా మండలానికి సంబంధించి ఐదు రహదారులు ఉన్నాయి. వెంకిర్యాల ఎదిర, చౌదరిగుడా వీరన్నపేట్, కంకల్ ఆర్‌అండ్ బి రోడ్డు నుంచి ఉమెంత్యాల్, రావిర్యాల నుంచి వీరసముద్రం, జెడ్పీ రోడ్ నుంచి నోకియా తండా వరకు ఈ రహదారులు ఉన్నాయి. ఇక ఫరూక్ నగర్ మండలంలో మొత్తం 12 రహదారులు మంజూరు కాగా షాద్ నగర్ నుంచి చటాన్ పల్లి మీదుగా కొడిచర్ల, కంసాన్పల్లి మీదుగా ఉడిత్యాల, పిడబ్ల్యు డి రోడ్డు మీదుగా చిన్న చిన్న ఎల్కిచెర్ల ద్వారా రంగారెడ్డి గూడా, ఎలికట్ల నుంచి కిషన్ నగర్ మీదుగా రామేశ్వరం, కమ్మదనం నుంచి హేమాజీపూర్ మీదుగా నేరెళ్ల చెరువు, ఎన్ హెచ్ 44 నుంచి బూర్గుల మీదుగా పోతురాజు గడ్డ తండా, షాద్నగర్ పిడబ్ల్యుడి రోడ్డు మీదుగా రంగంపల్లి, ఎన్ హెచ్ 44 మీదుగా చిలకమర్రి నుంచి పాత చిల్కమర్రి, మొగిలిగిద్ద నుంచి కందివ్వనం, చించోడు నుంచి కందివ్వనం, మొగిలిగిద్ద చౌలపల్లి, బూర్గుల మధురాపూర్ ఇలా మధ్యన ఈ రహదారులు ఉన్నాయి. ఇక కేశంపేట మండలానికి మొత్తం 7 రహదారులు మంజూరయ్యాయి. కేశంపేట ఎస్సీ కాలనీ నుంచి రామకృష్ణాపురం, జడ్పీ రోడ్ నుంచి పాటిగడ్డ, పిడబ్ల్యుడి రోడ్ నుంచి సుందరాపూర్ వేముల నర్వ నుంచి కొండారెడ్డిపల్లి, పిడబ్ల్యుడి రోడ్ నుంచి పాపిరెడ్డి గూడ, కొత్తపేట నుంచి కోనాయిపల్లి, సంతాపూర్ నుంచి మురళి నగర్ వరకు ఈ రహదారులు ఉన్నాయి. ఇక కొందర్గుకు మండలంలో మూడు రోడ్డులు మంజూరు కాగా రేగడి చిలకమర్రి నుంచి షాబాద్, గంగన్నగూడ నుంచి రావిర్యాల, వెంకిర్యాల నుంచి కొండబావులు వరకు ఈ రహదారులు ఉన్నాయి. ఇక కొత్తూరు, నందిగామ మండలాలకు ఒక్కో రహదారి చొప్పున మంజూరు అయ్యాయి. కొత్తూరు మండలానికి సిద్దాపూర్ నుంచి చింతగట్టు వరకు, నందిగామ మండలానికి చంద్రాయన కూడా నుంచి బండ కుంట వరకు రహదారులు మంజూరయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించనున్నారు.

## కాంగ్రెస్ అంటే విజయం..కాంగ్రెస్ ఉంటే సంక్షేమం

### జూబ్లీహిల్స్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రచారం

**షాద్‌నగర్ టౌన్, అక్టోబరు 28, ప్రభాత వార్త:** కాంగ్రెస్ అంటేనే విజయం.. కాంగ్రెస్ ఉంటేనే ప్రజా సంక్షేమం.. ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీ దే ఘనవిజయం.. అన్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మంగళవారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూసఫ్ కూడా డివిజన్లోని కృష్ణానగర్‌లో బూత్ నెంబర్ 247, 252లో ఖైరతాబాద్ కార్పొరేటర్ పి. విజయరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలను కలుసుకొని ఆప్యాయంగా మాట్లాడారు. మెకానిక్ షాప్ వద్దకు వెళ్లి వాహనాలు రిపేర్ చేస్తూ సందడి చేశారు. పారిశుధ్య కార్మికులను ఆప్యాయంగా పలకరించారు.కాంగ్రెస్ గెలుపు ఖాయం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలను అమలు చేయడం గర్వకారణమని అన్నారు. రాజధానిని కూడా ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు.



ఎమ్మెల్యే శంకర్

వార్త

విలేకర్లు కావలెను

రంగారెడ్డి జిల్లాలో రిపోర్టర్లుగా పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాము. ఆసక్తిగల అభ్యర్థులు తమ యొక్క బయోడేట సమర్పించగలరు.

ఈ క్రింది డేట్ లైన్‌లకు అభ్యర్థులు కావలెను

- షాద్‌నగర్ టౌన్
- ఇబ్రహీంపట్నం
- ఇబ్రహీంపట్నం రూరల్
- మాడ్గుల
- శంషాబాద్
- తుక్కుగూడ
- కందుకూర్
- ఆదిభట్ల

ఫోన్ నెం. 9110333134